క్లుప్తంగా

25 నుంచి ఆలయ వార్షికోత్సవం

ఖానాపూర్: పట్టణంలో ఈనెల 25 నుంచి నిర్వహించే సాయిబాబా ఆలయ 28వ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు అంకం రాజేందర్ కోరారు. శుక్రవారం కమిటీ సభ్యులతో కలిసి పట్టణంలో భక్తులకు కరపత్రాలను అందజేశారు. వచ్చే నెల ఒకటో తేదీన జాతర, అన్నదానం ఉంటుందని భక్తులు తరలిరావాలని కోరారు.

అదుపుతప్పి కారు బోల్తా


బోల్తాపడిన కారు

కడెం: మండలంలోని నవాబ్‌పేట్ గ్రామ సమీపంలో గురువారం అర్ధరాత్రి కారు అదుపుతప్పి బోల్తాపడింది. నవాబ్‌పేట్‌కు చెందిన వంశీ తన ముగ్గురు స్నేహితులతో కలిసి గ్రామానికి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

బాసర: మండలంలోని కౌట గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. పక్కా సమాచారంతో దాడి చేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. వారి నుంచి రూ.4,620 నగదు స్వాధీనం చేసుకున్నామనిన్నారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వెల్లడించారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు

భైంసాటౌన్: పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ హాజరై 169 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, పట్టణ కౌన్సిలర్లు, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

'ఉపాధి' గ్రామసభ


సభలో చదివి వినిపిస్తున్న సభ్యులు

కుభీర్: మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. 2023– 2024 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనుల వివరాలను తనిఖీ బృందం సభ్యులు గ్రామసభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో కార్యదర్శి వి జయ్, టీఏ మహేశ్, డీఆర్పీ వెంకటేశ్, పి. బాబు, బి.ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

జిల్లా గ్రంథం అందజేత


పుస్తకం అందిస్తున్న రచయితలు

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ రచయితల వేదిక, మానస సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో రచయితలు శుక్రవారం జిల్లా కేంద్రానికి చెందిన వైద్యులు డాక్టర్ ప్రమోద్ చంద్రారెడ్డికి 'నిర్మల్ జిల్లా సమగ్ర స్వరూపం 'గ్రంథం అందజేశారు. జిల్లా చరిత్ర సంస్కృతి, వారసత్వ సంపదకు సంబంధించిన పలు వ్యాసాలు ఇందులో నిక్షిప్తమై ఉన్నాయని.. పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు, జిల్లా పరిశోధకులకు ఈ గ్రంథం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మానస సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు తుమ్మల దేవరావు, తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు నేరెళ్ల హనుమంతు, అబ్బడి రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఖానాపూర్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీవో రత్నాకర్‌రావు.. పంచాయతీ అధికారులు, సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని కొత్తపేట్ గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా సెగ్రిగేషన్ షెడ్డు, వైకుంఠ దామం, పల్లె ప్రకృతివనం, వీధుల్లో చేపట్టిన పారిశుధ్య పనులు సందర్శించారు. అనంతరం పంచాయతీ కార్యాలయానికి వెళ్లి పలు రికార్డులు తనిఖీ చేశారు.

కోతులతో కొండంత కష్టం


కోతులు పెంకులు తీసేయడంతో టార్పాలిన్లు కప్పుకున్న రైతులు


ఎల్విలో ఇళ్లపై తిరుగుతున్న కోతులు

తానూరు: మండలంలోని ఎల్వి గ్రామ ప్రజలకు కోతులతో కొండంత కష్టమొచ్చింది. వానరాలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ఇళ్లపై ఉన్న పెంకులు తీస్తూ.. విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తూ.. వస్తువులను చిందర వందర పడేస్తున్నాయి. సమీపంలోని చేన్లలోచొరబడి ధ్వంసం చేస్తున్నాయి. ఇళ్లపై పెంకులు తీస్తుండటంతో వర్షాకాలంలో ఇళ్లు ఉరుస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

గుంపులుగా తిరుగుతూ..

గుంపులుగా వానరాలు తిరుగుతుండడంతో వాటిని కట్టడి చేసేందుకు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వడం లేదు. వాహనాదారులు, పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు, గ్రామస్తులపై పడి కరుస్తున్నాయి. చేతిలో ఏదైనా పట్టుకొని రావాలంటేనే భయపడుతున్నామని వాపోతున్నారు. కోతుల భయానికే చిన్నపిల్లలను ఇంటి వద్ద ఉంచకుండా తమతో వ్యవసాయ పనులకు తీసుకెళ్తున్నట్లు పే ర్కొంటున్నారు.

రైతులకు తప్పని కష్టాలు..

ఆరుగాలం శ్రమించి పంటలు పండించుకుంటున్న రైతులకు కష్టాలు తప్పడం లేదు. గ్రామంలోని శనగ, మొక్కజొన్న, కంది, జొన్న పంటలపై కోతులు దాడి చేస్తుండటంతో సరైన దిగుబడి రాక నష్టాలు మిగులుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అటవీశాఖ అధికారులు మాత్రం నష్ట పరిహారం ఇవ్వడం లేదని.. అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల పట్టింపేది ..

ఆరేళ్ల కిందట నిజామాబాద్ జిల్లా నుంచి కోతుల గుంపును తీసుకొచ్చి ఎల్వి గ్రామ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో వదిలేశారు. దీంతో అప్పటినుంచి ఎల్వి గ్రామంలో కోతుల బెడద పెరుగుతూనే ఉంది. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఐదేళ్ల కిందట భైంసా అటవీశాఖ అధికారులు గ్రామానికి వచ్చి వలల సాయంతో కొన్ని కోతులను పట్టుకొని మరోచోటకు తరలించగా.. కొన్ని ఇక్కడే ఉండిపోయాయి. రెండేళ్ల కిందట గ్రామస్తులు కోతులు పట్టేవారిని తీసుకొచ్చినా పూర్తిస్థాయిలో వీటి బెడద తగ్గడం లేదు. నానావస్థలు పడుతున్నామని అధికారులు, పాలకులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

సమస్య పరిష్కారానికి చర్యలు

త్వరలోనే ఎల్వి గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడుతాం. కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకుంటాం. ఆ వివరాలను ఉన్నతాధికారులకు నివేదించి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

– వేణుగోపాల్, ఎఫ్ఆర్‌వో

బయటకు వెళ్లాలంటే భయమే



కోతుల కారణంగా బయటకు వెళ్లాలంటేనే భ యంగా ఉంది. ఇంట్లో ఎవరు లేకుంటే కోతులు.. పైకప్పు పెంకులు తీసి ధ్వంసం చేస్తున్నా యి. ఒక్కోసారి ఇళ్లలోకి చొరబడుతున్నాయి. త లుపులు పెట్టుకుని ఇంట్లోనే ఉండాల్సి వస్తోంది. పైకప్పు దెబ్బతినడంతో ఇళ్లపై టార్పాలి న్లు కప్పుకొంటున్నాం.

– నారాయణ, స్థానికుడు

కాపలా ఉంటున్నాం



కోతులు ఇళ్లతోపాటు పంట చేన్లను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో రాత్రి, పగలు పంటలకు కాపలా ఉంటున్నాం. మాకు నష్టం జరుగుతున్నా.. అధికారులు పరిహారం అందించడం లేదు. అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి.. బాధితులకు నష్ట పరిహారం అందించాలి.

– కిషన్, స్థానికుడు

క్షేత్రస్థాయికి వెళ్లి అర్హులను ఎంపిక చేయాలి


బావాపూర్(కె)లో పర్యవేక్షిస్తున్న ఎంపీవో


తాండ్ర(జి)లో సర్వే చేస్తున్న సిబ్బంది


దస్తురాబాద్ : మున్యాలలో..

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని బావాపూర్(కె)తోపాటు గ్రామాల్లో ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో తిరుగుతూ వివరాలు నమోదు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు సర్వే వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తున్నట్లు పేర్కొన్నారు.

సారంగపూర్: ప్రజాసంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు చేపట్టిన సర్వే కొనసాగుతోంది. శుక్రవారం మండలంలోని తాండ్ర(జి), ఆలూరు, కౌట్ల(బి), జామ్ తదితర గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా నూతన రేషన్‌కార్డుల కోసం ప్రజాపాలన గ్రామసభలో దరఖాస్తులు సమర్పించిన వారి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ నర్సయ్య, జూనియర్ అసిస్టెంట్ మోహన్ తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక సర్వే పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఎంపీడీవో రమేశ్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని మున్యాల, ఆకొండపేట గ్రామాల్లో రైతుభరోసా, రేషన్‌కార్డుల కోసం సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ గంగన్న, మండల వ్యవసాయ విస్తరణాధికారి తిరుపతి, సర్వేయర్ సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని గ్రామాల్లో రైతుభరోసా పథకానికి అర్హుల ఎంపికకు సర్వే కొనసాగుతోంది. శుక్రవారం చామన్‌పెల్లి, చింతల్‌చాంద, మల్లాపూర్ గ్రామాల్లో సాగుకు యోగ్యం కాని భూముల వివరాలను అధికారులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ అజీజ్, మండల వ్యవసాయాధికారి వసంత్‌రావు, ఏఈఓ పవిత్ర, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్, క్రికెట్ పోటీలు


కుంటాల : విజేతకు కప్ అందిస్తున్న సత్యం గిరీశ్


నర్సాపూర్(జి): తురాటిలో..


కుభీర్ : బహుమతి అందిస్తున్న నాయకులు

కుంటాల: మండలంలోని లింబా(కె) గ్రామంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని సత్యం భూమన్న స్మారకార్థం వారి మనుమడు సత్యం గిరీశ్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఫైనల్‌లో దత్త సాయి జట్టుపై ఆకాశ్ జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. శుక్రవారం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఆత్మ మాజీ చైర్మన్ సవ్వి అశోక్ రెడ్డి, సత్యం గిరీశ్, ఆనంద్‌రావుపటేల్, దత్తురాం పటేల్, ఎల్‌పీఎల్ చైర్మన్ మల్లారెడ్డి, వైస్ చైర్మన్ అశోక్‌రెడ్డి, వినాయక్ రెడ్డి, ముత్యంరెడ్డి, గౌతమ్ పాల్గొన్నారు.

నర్సాపూర్ (జి): మండలంలోని తురాటి గ్రామంలో తురాటి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.ఐదు వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన జట్టుకు రూ.2500 నగదుతో పాటు ట్రోఫీలను మాజీ వైస్ ఎంపీపీ సూర్యవంశీ లక్ష్మణ్‌పటేల్ అందజేశారు. దాతలుగా సట్ల రాజు, సట్ల రవి, సూర్యవంశీ లక్ష్మణ్ పటేల్, చంద్యాల మురళి వ్యవహరించారు. గ్రామానికే చెందిన బొత్త సురేశ్ క్రీడాకారులకు భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు.

కుభీర్:మండలంలోని సిర్పెల్లిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో బెల్గాం తండా జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో పల్సి జట్టు నిలిచింది. ఈ టోర్నీలో 14జట్లు పాల్గొనగా విజేతలకు మాజీ సర్పంచ్ హన్మాండ్లు, నాయకులు ధర్మపురి, గంట గణేశ్ బహుమతులు ప్రదానం చేశారు.

పంటల రక్షణకు రైతుల పాట్లు


ముధోల్‌లో పంటకు రక్షణగా రైతులు ఏర్పాటు చేసుకున్న చీరెలు


చేను వద్ద ఏర్పాటు చేసిన మంచె

ముధోల్: మండలంలోని పలు గ్రామాల్లో ఆరుగాలం కష్టపడి పండించుకున్న పంటలను అడవిజంతువులు ధ్వంసం చేస్తున్నాయి. వీటి బారి నుంచి తమ రెక్కల కష్టాన్ని కాపాడుకునేందుకు అన్నదాతలు పంటచేన్ల వద్ద మంచె వేసుకొని కాపలా ఉంటున్నారు. మరికొందరు పంటల చుట్టూ తీగలు ఏర్పాటు చేసి పాత చీరెలు కడుతున్నారు. ఈ చీరెలకు భయపడి జంతువులు పంటల వైపు రాకుండా ఉంటాయని కర్షకులు పేర్కొంటున్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మోహన్ తెలిపారు. స్థానిక సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో నిర్మల్‌రోడ్, ఓవైసీనగర్, రాజీవ్‌నగర్, మోమినామ్ గల్లి, ఏక్ మినార్, మదీనాకాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. ప్రజలు సహకరించాలని కోరారు.

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ డి.శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్(జి), కుస్లి, అంజనితండా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

సోన్: మండలంలోని న్యూవెల్మల్, బొప్పారం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జి ఏఈ అనిల్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు న్యూవెల్మల్, బొప్పారం, కూచన్‌పెల్లి, సంగంపేట, గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. గ్రామస్తులు సహకరించాలని కోరారు.

లక్ష్మణచాంద: లక్ష్మణచాంద, వడ్యాల్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ మహేశ్ ఓ ప్రకటనలో తెలిపారు.

'దేవాదాయశాఖకు డీఈని నియమించాలి'


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు

ఖానాపూర్: జిల్లాలో దేవాదాయశాఖ డీఈ పోస్టును భర్తీ చేయాలని ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ మహాదేవ అన్నపూర్ణ ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు శుక్రవారం నిర్మల్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు వినతిపత్రం అందజేశారు. డీఈ అధికారి పోస్టు ఖాళీగా ఉండడంతో ఆలయ నిర్మాణ పనుల ఎంబీ రికార్డుల బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయని పేర్కొన్నారు. దీంతో బిల్లులు రాక పనులు నిలిచిపోతున్నాయని వివరించారు. కార్యక్రమంలో సభ్యులు బత్తుల నారాయణ, ఎం.మల్లేశ్, మహేశ్, రాజు, కృష్ణప్రసాద్, శంకర్ తదితరులు ఉన్నారు.

లింబా(కె) దర్గా వద్ద ప్రార్థనలు


మలీదలు సమర్పిస్తున్న గ్రామస్తులు

కుంటాల: మండలంలోని లింబా(కె) గ్రామంలో దేవరగుట్ట దర్గా వద్ద శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. డప్పుచప్పుళ్లతో దర్గా వద్దకు చేరుకుని మలీద ముద్దలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలయ్ బలయ్ అంటూ కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. కార్యక్రమంలో ఆత్మ మాజీ చైర్మన్ సవ్వి అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్‌రావు పటేల్, మాజీ ఎంపీటీసీ సత్యం గిరీశ్, సొసైటీ డైరెక్టర్ గోనె గజ్జారాం, వీడీసీ చైర్మన్ ముత్యంరెడ్డి, గౌతమ్ పాల్గొన్నారు.

'గౌడ కులస్తులు ఐక్యంగా ఉద్యమించాలి'


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: కల్లుగీత వృత్తి రక్షణ సాధనకు గౌడ కులస్తులు రాజకీయ పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉద్యమించాలని మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గౌడ సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. స్థానికసంస్థల ఎన్నికల్లో గౌడ కులస్తులు అధిక సంఖ్యలో పోటీ చేసి విజయం సాధించాలని సూచించారు. అనంతరం మోకుదెబ్బ జాతీయ కమిటీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ కమిటీ జిల్లా అధ్యక్షుడు గోపిగౌడ్, నాయకులు రాజేందర్‌గౌడ్, బాలగౌడ్, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మొగ్లిలో బోనమెత్తిన భక్తులు


బోనాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

తానూరు: మండలంలోని మొగ్లి గ్రామంలో మహాలక్ష్మి జాతర సందర్భంగా శుక్రవారం భక్తులు అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. డప్పుచప్పుళ్ల నడుమ ఆలయానికి వచ్చి పూజలు చేశారు. సమీప గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి రావడంతో ఆలయం వద్ద సందడి నెలకొంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అప్పగింత


పోలీసులకు అప్పగిస్తున్న గంగాధర్

బాసర: మండలకేంద్రంలో గోదావరి నది మొదటి పుష్కరఘాట్ నుంచి రెండో పుష్కరఘాట్‌కు వెళ్లే మార్గంలో ముళ్ల పొదల్లో పడి ఉన్న మతిస్థిమితం లేని వ్యక్తిని స్థానికులు కాపాడారు. పోలీసుల సాయంతో కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. సదరు వ్యక్తిని గ్రామానికి చెందిన పుట్టోళ్ల గంగాధర్ గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. కానిస్టేబుల్ మోహన్ సింగ్ అక్కడకు వచ్చి అతడిని పొదల నుంచి బయటకు తీశారు. మ తిస్థిమితం లేని వ్యక్తిని వివరాలు అడిగి మెదక్ జిల్లా రెడ్డిపల్లికి చెందిన నర్సింహులుగా గుర్తించారు. అనంతరం పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

పరిశీలన

ఖానాపూర్: ఖానాపూర్ సబ్‌స్టేషన్‌లో జరుగుతున్న మరమ్మతులను శుక్రవారం ఏఈ రాంసింగ్ ప రిశీలించారు. సబ్‌స్టేషన్‌లో పురాతన 33 కేవీ పొటెన్షియల్ ట్రాన్స్‌ఫార్మర్ తొలగించి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రెండు గంటలు విద్యుత్ నిలిపివేసినట్లు పేర్కొన్నారు.